చదువులు సాగేదెలా..?

- ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కరువు
- మరుగున పడ్డ మన ఊరు-మన బడి పథకం
- ప్రభుత్వం మారడంతో అసంపూర్తిగా నిర్మాణాలు
- 'అమ్మ ఆదర్శ'కు ఎంపిక చేయని వైనం


కన్నెపల్లి జడ్పీహెచ్ఎస్‌లో నిలిచిపోయిన అదనపుగదుల నిర్మాణం

మంచిర్యాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కరువై విద్యార్థులు సమస్యలతో సతమతమవుతున్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా పనులు నిలిచిపోతుండడంతో సమస్యలకు పరిష్కారం లభించడం లేదు. బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రవేశపెట్టిన మన ఊరు-మన బడిపథకం అర్ధాంతరంగా నిలిచిపోవడంతో పనులు నిలిచిపోయాయి. మన ఊరు-మనబడి, మనబస్తీ-మనబడి కార్యక్రమంలో భాగంగా జిల్లాలో మొత్తం 248 పాఠశాలలను ఎంపిక చేశారు. ఆయా పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణం, అదనపు తరగతి గదుల ఏర్పాటు, తాగునీటి సౌకర్యం, భోజనశాల, ఫర్నిచర్ తదితర పనులు చేప ట్టాలని నిర్ణయించారు. ఎంపిక చేసిన వాటిలో 112 పాఠశాలల్లో పూర్తి స్థాయిలో పనులు చేపట్టారు. మిగతా 136 స్కూళ్లలో పనులు పెండింగులో ఉన్నాయి. పనులు పూర్తయిన వాటిలో సగ భాగం పాఠశాలలకు సంబంధించి నిధులు ఇంతవరకు విడుదల కాలేదు.

● కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుతో..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తరువాత ప్రభుత్వ పాఠశాల్లో మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టింది. అమ్మ ఆదర్శ పాఠశాల పేరుతో పనులు చేపట్టాలని నిర్ణయించింది. జిల్లాలో 478 పాఠశాలలను ఎంపిక చేశారు. పనులు వేగంగా జరుగుతుండటంతో ఎంపిక చేసిన వాటిలో 90 శాతం పాఠశాలల్లో పనులు దాదాపుగా పూర్తయ్యాయి. ఆ పనులకు సంబంధించి మొత్తం రూ.16కోట్ల వ్యయం అంచనా వేయగా అందులో కేవలం 50 శాతం మాత్రమే నిధులు మంజూరయ్యాయి.

● రూ. 58 కోట్ల 36 లక్షలు

మన ఊరు-మనబడి, మనబస్తీ-మనబడిలో భాగంగా జిల్లాకు రూ.58 కోట్ల 36 లక్షలు మంజూరు కాగా ఇప్పటి వరకు అయిన పనులకుగాను రూ.17 కోట్ల 9 లక్షలు విడుదల అయ్యాయి. ఇంకా రూ.26 కోట్ల పనులు పూర్త యినందున వాటికి ఎంబీ రికార్డులు చేసినప్పటికీ నిధులు విడుదల కాలేదు. ఆ పనులను అప్పటి సర్పంచులు చేప ట్టగా, ప్రభుత్వం మారడంతో అప్పుతెచ్చి పూర్తి చేసిన పనులకు బిల్లులు రాకుండా పోయాయి. ఇదిలా ఉండగా పనులు అసంపూర్తిగా ఉన్న 136 పాఠశాలల పరిస్థితి అధ్వానంగా ఉంది. పనులను కాంట్రాక్టర్లు అర్ధాంతరంగా వదిలిపెట్టడంతో మొండి గోడలు, అసంపూర్తి టాయిలెట్స్ దర్శనమిస్తున్నాయి. ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తి కాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

మిగతా నిధులు ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్ల ద్వారా నివేదికలు పంపాల్సి ఉంది. ఎంపిక చేసిన పాఠశాలల్లో ఇంకా 20 శాతం మేర పనులు చేపట్టవలసి ఉంది. నిధులు విడుదలైతేగానీ పనులు ముందుకు సాగే పరిస్థితి లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోని 'మన ఊరు- మనబడి' కార్యక్రమం కింద జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలలను కాంగ్రెస్ పథకం 'అమ్మ ఆదర్శ పాఠశాల'కు ఎంపిక చేయలేదు. ఆ సమయంలో ఎంపిక చేసిన 248 పాఠశాలల నుంచి పనులు పూర్తిగాని 136 స్కూళ్ల వైపు అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో అసంపూర్తిగా వదలివేసిన పనులు అలాగే ఉండగా, కొత్త పథకానికి ఎంపిక కాకపోవడం వల్ల విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు.


కన్నెపల్లి మండలంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న బాత్‌రూంలు

● ఉదాహరణకు మంచిర్యాల జిల్లాలోని ఎంపీపీఎస్ కన్నెపల్లి పాఠశాలను గతంలో 'మన ఊరు-మనబడి' పథకానికి ఎంపిక చేశారు. విద్యార్థుల సౌకర్యార్థం బాత్ రూంలు నిర్మించాలని నిర్ణయించారు. గోడలు పూర్తయినప్పటికీ అందులో ఇతరత్రా పనులు చేపట్టలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల పథకానికి ఎంపిక చేయకపోవడంతో ఆ పనులు పూర్తయ్యే పరిస్థితి లేదు. ఈ పాఠశాలలో జిల్లాలోని ప్రైమరీ స్కూళ్లలో 154 మంది విద్యార్థులు ఉన్నారు.

● కన్నెపల్లి మండలంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ పరిస్థితి కూడా అలాగే ఉంది. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు గదులు నిర్మించాలని నిర్ణయించారు. బీఆర్ఎస్ హయాంలోని మన ఊరు- మన బడి కార్యక్రమానికి పాఠశాలను ఎంపిక చేశారు. పిల్లర్ల దశలో పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం ఆ పాఠశాల సైతం 'అమ్మ ఆదర్శ పాఠశాల' పథకానికి ఎంపిక కాలేదు. దీంతో అదనపు గదుల పనులు ముందుకు సాగడం లేదు.

న్యూస్ బాక్స్

విద్యుత్ శాఖ ఏడీఈగా బాలకృష్ణ


ఏడీఈని సన్మానిస్తున్న నాయకులు

చెన్నూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు విద్యుత్ శాఖ ఏడీఈగా దాసరి బాలకృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన రవికుమార్ బెల్లంపల్లిరూరల్‌కు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో జిల్లా కేంద్రంలో కమర్షియల్ ఏడీఈగా పనిచేసిన బాలకృష్ణ చెన్నూరు ఏడీఈగా వచ్చారు. ఆయనను విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది, మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజుద్దీన్, కౌన్సిలర్లు సన్మానించారు. ఏఈలు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన శ్రీరాంపూర్ సీఐ


సీఐ వేణుచందర్

శ్రీరాంపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ సీఐగా డి.వేణు చందర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. రాజన్న - సిరిసిల్ల జిల్లా సీసీఎస్ విభాగంలో పని చేస్తున్న ఆయన శ్రీరాంపూర్ బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన సీఐ డి.మోహన్‌ను మల్టీజోన్-1 ఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని అధికారులు ఆదేశించారు.

బతుకమ్మ చీరల పంపిణీలో గందరగోళం


మత్కేపల్లిలో బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న ఐకేపీ సిబ్బంది

కాసిపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ చీరల పంపిణీ ఆందోళనలు, నిరసనల మధ్య గురువారం నిలిచిపోయింది. మండలానికి 10770 చీరలు బుధవారం వచ్చాయి. వీటిని ఇందిరాక్రాంతి పథం సభ్యులకు అప్ప గించారు. స్వయం సహాయక సంఘంలోని సభ్యులకు మాత్రమే చీరలు అం దజేయాలని తెలిపారు. దీంతో 18 సంవత్సరాలు ఉన్న బాలికలు, 60 ఏండ్లు ఉన్న మహిళలకు ప్రభుత్వం మొండి చేయి చూపించింది. దీంతో ఆగ్రహిం చిన మహిళలు చీరల పంపిణీ కేంద్రాల వద్ద ఆందోళనలు చేపట్టారు. ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వకుండా ఐకేపీ సిబ్బంది చీరలు పంపిణీ చేయడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఉన్నతాధికారుల ఆదేశాలతో బతుకమ్మ చీరల పంపిణీకి తాత్కాలికంగా బ్రేక్ వేశారు. పండగ తర్వాత చీరలు పంపిణీ చేయడంపై మహిళలు ఆగ్రహం వ్యక్తంచేశారు.

కూరగాయల మార్కెట్‌కు గుండా మల్లేష్ పేరు పెట్టాలి

బెల్లంపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కాంటా చౌరస్తా వద్ద నిర్మించిన కూరగాయల మార్కెట్‌కు మాజీ ఎమ్మెల్యే గుండా మల్లేష్ పేరు పెట్టాలని గురువారం ఆర్డీవో, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌లకు సీపీఐ నాయకులు వినతిపత్రాలు అందించారు. బెల్లంపల్లి కూరగాయల మార్కెట్‌లోని వ్యాపారుల సంక్షేమానికి గుండా మల్లేష్ ఎంతో కృషి చేశారని తెలిపారు. చిప్ప నర్సయ్య, రాజమౌళి, గుండ సరోజ, పూర్ణిమ, లక్ష్మీనారాయణ, చంద్ర మాణిక్యం, దాగం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కళోత్సవ్ పోటీలు

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సైన్స్ కేంద్రంలో ఈ నెల 16, 17వ తేదీల్లో జరిగిన జిల్లా స్థాయి కళోత్సవ్ పోటీలు ముగిశాయి. గాత్రం, వాయిద్య సంగీతం, నృత్యం, డ్రామా, సాంప్రదాయ కథల పోటీ, విజువల్ ఆర్ట్స్ అనే ఆరు అంశలపై పోటీలు జరుగగా 175 మంది విద్యార్థులు, 75 మంది గైడ్ టీచర్లు, 18 మంది జడ్జిలు పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను, ప్రశంసాపత్రాలను అందజేశారు. సమన్వయకర్త సత్యనారాయణమూర్తి, ముఖ్య అతిథిగా కె.చౌదరి, పి.శ్రీనివాస్, ఎస్.మధుబాబు పాల్గొన్నారు.

రేపు జిల్లాస్థాయి సైన్స్ సెమినార్

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా సైన్స్ కేంద్రంలో ఈ నెల 19న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, పొటెన్షియల్ అండ్ కన్సర్న్స్ అనే అంశంపై హైస్కూల్ విద్యార్థులకు జిల్లాస్థాయి సైన్స్ సెమినార్-2024 నిర్వహిస్తున్నట్లు డీఈవో ఎస్.యాదయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులు ఈ సెమినార్‌కు అర్హులని, 6 నిమిషాల్లోపు ప్రజెంట్ చేయాలని, న్యాయనిర్ణేతలతో ప్రశ్నలుంటాయని తెలిపారు. జిల్లాస్థాయి విజేతలు రాష్ట్ర స్థాయిలో, రాష్ట్రస్థాయి విజేతలు జాతీయ స్థాయిలో పాల్గొంటారని, రాష్ట్ర స్థాయి సెమినార్‌ను ఈ నెల 29న జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్ విద్యార్థులను ప్రోత్సహించి సెమినార్‌లో పాల్గొనేలా చూడాలని తెలిపారు. పాల్గొనే విద్యార్థుల వివరాలను జిల్లా సైన్స్ అధికారి మధుబాబు సెల్: 9849550200 నెంబర్‌కు కాల్ చేయాలని డీఈవో సూచించారు.

అభివృద్ధి పనుల పరిశీలన


పంచాయతీ కార్యాలయం వద్ద నేషనల్ లెవెల్ మానిటర్స్ అధికారులు

హాజీపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బుద్దిపల్లి గ్రామంలో నేషనల్ లెవెల్ మానిటర్స్ అధికారులు సునీల్, బాలమురళిలు గురువారం పర్యటించారు. పంచాయతీ ప్రొఫైల్, క్యాష్‌బుక్స్, పించన్‌లు, జనాభా, కేంద్ర ప్రభుత్వ నిధుల ద్వారా పంచాయతీలో చేపట్టిన పనుల వివరాలను పరిశీలించారు. నర్సరీలు, పంచాయతీ భవనం పనులు, ప్లాంటేషన్ పనులను పరిశీలించారు. అధికారులను ఎంపీడీవో రత్న ప్రసాద్, ఎంపీవో ఉమర్ షరీఫ్‌లు సన్మానించారు. ఏపీడీ సదానందం,ఏపీవో మల్లయ్య, పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలను ఉపేక్షించం


సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ

మంచిర్యాల అర్బన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించమని డీసీపీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. సెప్టెంబర్ 9 నుంచి 24వ తేదీ వరకు జరిగిన సంఘటనలు, నమోదైన కేసులు, తీసుకున్న చర్యలపై గురువారం ఏసీపీ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. అలాగే జూన్ 1 నుంచి అక్టోబరు 17 వరకు జిల్లాలో 1,477 మం దిని బైండోవర్ చేశామన్నారు. 27 మందిపై కేసులు నమోదు చేసి 82 మంది అరెస్టు చేయగా 8 మంది పరారీలో ఉన్నారని పేర్కొన్నారు. గంజాయికి బానిసైన 37 మందిని డీ అడిక్షన్ సెంటర్‌కు పంపించామని, 194 మందికి కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. భూ తగాదాల్లో బెదిరింపులకు పాల్పడితే పోలీసులకు లేదా 100కు డయల్ చేయాలన్నారు. ఏసీపీ ప్రకాష్, సీఐ అశోక్, ఎస్సైలు పాల్గొన్నారు.

ఆదికవి వాల్మీకి అందరికీ ఆదర్శనీయం


వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రామాయణ మహా కావ్యం రూపకర్త, ఆదికవి మహర్షి వాల్మీకి అందరికి ఆదర్శనీయమని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన వాల్మీకి జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్ మోతిలాల్‌తో కలిసి పాల్గొన్నారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ వాల్మీకి రామాయణం మహా గ్రంథాన్ని 23 వేల శ్లోకాలతో, 7 ఖండములతో ఆదికావ్యంగా పూర్తి చేసి మహర్షిగా మారాడన్నారు. జిల్లా షెడ్యూల్డు కులాల అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

నస్పూర్(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు, కమిషనర్ చిట్యాల సతీష్, ఏఇ మధు, సిబ్బంది పాల్గొన్నారు.

దండేపల్లి(ఆంధ్రజ్యోతి): మహర్షి వాల్మీకి జీవితం నేటి సమాజానికి ఆదర్శమని వాల్మీకి బోయ సంఘం నాయకులు బొమ్మెన మల్లేష్, లక్ష్మిరాజంలు అన్నారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గంగాధర్, మహేష్, సత్యం, చంద్రశేఖర్, పాల్గొన్నారు.

హాజీపూర్(ఆంధ్రజ్యోతి): గుడిపేట 13వ బెటాలియన్‌లో వాల్మీకి మహర్షి జయంతి నిర్వహించారు. బెటాలియన్ కమాండెంట్ వెంకటరాములు వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

తాండూర్(ఆంధ్రజ్యోతి): వాల్మీకినగర్ (బోయవాడ)లో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు జెండా ఆవిష్కరించారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్ (ఆంధ్రజ్యోతి): క్యాతన్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతి నిర్వహించారు. చైర్‌పర్సన్ జంగం కళ వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కమిషనర్ మురళికృష్ణ, ఆర్ఐ సతీష్‌పాల్గొన్నారు.

శ్రీరాంపూర్(ఆంధ్రజ్యోతి): వాల్మీకి చిత్రపటానికి ఏరియా జీఎం బి.సం జీవరెడ్డి పూల మాల వేసి నివాళుల ర్పించారు. ఎస్‌ఓటు జీఎం సత్యనారా యణ, బాజీసైదా, వెంకటేశ్వర్ రెడ్డి, మురళీధర్, రాముడు, అరవిందరావు, చిరంజీవులు, పాల్గొన్నారు.

జైపూర్(ఆంధ్రజ్యోతి): ఎస్టీపీపీలో ఈడీ రాజశేఖర్‌రావు వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. శ్రీనివాసులు, జేఎన్ సింగ్, సత్యనారాయణ, పాల్గొన్నారు.

నెన్నెల(ఆంధ్రజ్యోతి): బోయవాల్మీకి సంఘం ఆధ్వర్యంలో హనుమాన్ మందిరంలో వాల్మీకి చిత్రపటానికి పూజలు చేశారు. కార్యదర్శి సురేష్, సంఘం నాయకులు బండి రాకేష్, గుజ్జుల బానేష్, అబ్బర్ల శ్రీశైలం, రాజు, వెంకటేష్, గణేష్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని నిరసన


అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న కళాశాలల యాజమాన్యాలు, అధ్యాపకులు

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 17 (ఆంధ్రజ్యోతి): మూడు సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు, అధ్యాపకులు ఐబీ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్యేను, అదనపు కలెక్టర్‌ను కలిసి వినతి పత్రాలను అందించారు. బకాయిలను విడుదల చేసే వరకు ఆందోళనలను కొనసాగిస్తామన్నారు.

గూడెంలో భక్తుల రద్దీ


సత్యదేవున్ని దర్శించుకుంటున్న భక్తులు

దండేపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గూడెం సత్యనారాయణ స్వామి ఆలయంలో గురువారం పౌర్ణమి సందర్భంగా భక్తుల రద్దీ నెల కొంది. భక్తులు కుటుంబ సమేతంగా వచ్చి సత్యదేవున్ని దర్శించుకొన్నారు. భక్తులు గోదావరి నదిలో స్నానాలు ఆచరించి గంగమ్మ తల్లికి పూజలు చేశారు. సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు. అన్నదానం నిర్వహించినట్లు ఈవో శ్రీనివాస్ పేర్కొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా కృషి


మహిళకు ధ్రువపత్రం అందజేస్తున్న కలెక్టర్

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా ప్రభుత్వం ఇందిరా మహిళ శక్తి పథకం ద్వారా కృషి చేస్తోందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మహిళలు వ్యాపారాల్లో ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రోత్సహిస్తున్నామని, ఈ క్రమంలో జిల్లాలో క్యాంటీన్‌లు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ యూనిట్లను ఎంపిక చేసుకున్న లబ్ధిదారులకు సెప్టెంబరు 19 నుంచి 28 వరకు హైద్రాబాద్‌లో శిక్షణ ఇచ్చారు. వారికి గురువారం కలెక్టరేట్‌లో ధ్రువపత్రాలు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళ శక్తి క్యాంటీన్‌లు, డైరీఫార్మ్, కోళ్లు, చేపల పెంపకం వివిధ యూనిట్ల స్థాపనకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. మహిళ శక్తి క్యాంటీన్ యూనిట్లను ఎంపిక చేసుకున్న లక్షెట్టిపేటకు చెందిన జమున, హాజీపూర్ చెందిన జ్యోతి, ఈవెంట్ మేనేజ్‌మెంట్ గుడిపేటకు చెందిన ధనలక్ష్మీకి ధ్రువపత్రాలు అందజేశారు. డీఆర్‌డీవో కిషన్, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా కుమరంభీం వర్ధంతి


కుమరంభీం విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

మంచిర్యాల అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కుమరంభీం వర్ధంతి సందర్భంగా గురువారం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం జోడేఘాట్‌లో కుమరంభీం విగ్రహానికి ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు నివాళులర్పించారు.

మంచిర్యాల కలెక్టరేట్, (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహంలో తెలంగాణ విద్యార్థి ఉద్యమవేదిక నాయకులు కుమరంభీం వర్ధంతి నిర్వహించారు. జల్ జంగల్ జమీన్ కోసం, ఆదివాసీల అభివృద్ధికి భీం చేసిన సేవలను కొనియాడారు. రాష్ట్ర కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాసిపేట, (ఆంధ్రజ్యోతి): కుమరంభీం వర్ధంతిని ఆదివాసీ నాయకులు నిర్వహించారు. భీం చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భీం చేసిన పోరాటాలను కొనియాడారు.

భీమారం(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కుమరంభీం వర్ధంతిని ఆదివాసీ నాయకపోడు, గిరిజన సంఘాల నాయకులు నిర్వహించారు. భీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహేష్, లచ్చన్న, కృష్ణమూర్తి, శ్రీలత, బుచ్చయ్య పాల్గొన్నారు.

కోటపల్లి, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో కుమరంభీం వర్ధంతిని నిర్వహించారు. భీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జేక శేఖర్, నాయకులు విజయ్, జైలు పాల్గొన్నారు.

తాండూర్, (ఆంధ్రజ్యోతి): తాండూర్ మండల కేంద్రంలో కుమరంభీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధికారులు, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

జన్నారం, (ఆంధ్రజ్యోతి): ఇందన్‌పల్లి చౌరస్తాలో కుమరంభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు సోనేరావు, కాళి, హన్మంతరావు, లక్ష్మణ్, నర్సింగరావు, బారిక్‌రావు, వసంత్ పాల్గొన్నారు.

గర్మిళ్ల, (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని వాకర్స్ రీడింగ్ రూం ఆవరణలో వాకర్స్ అసోసియేషన్ నాయకులు కుమరంభీం వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలులర్పించారు. గజెల్లి వెంకటయ్య, ఆకుల సత్తన్న, భాస్కర్‌రావు, త్రివేదరావు, విశ్వేశ్వర్‌రావు, పాల్గొన్నారు.

స్థానిక యువతకు ఉద్యోగాలు ఇవ్వాలి

కాగజ్‌నగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ ఎస్పీఎంలో స్థానిక యువతకు ఉద్యోగ అవకాశం కల్పించాలని యువకులు కాగజ్‌నగర్ గేటు సమీపంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మిల్లు ప్రతినిధి రమేష్‌రావుకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వనమాల రాము, సూరజ్, యువకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కొలువులు సాధించిన వారికి సన్మానం

రెబ్బెన, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): గోలేటి సోషల్ వెల్ఫేర్ సొసైటీ, కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైస్ ఆధ్వర్యంలో గోలేటి గ్రంథాలయంలో చదువుకొని డీఎస్సీలో ఎస్జీటీలో ఉద్యోగాలు సాధించిన తిరుపతి, దేవేందర్, ప్రశాంత్‌ను గురువారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గోలేటి సొసైటీ అధ్యక్షుడు అబ్దుల్ వసీం, ఉపాధ్యక్షుడు పాత్రశ్రీనివాస్, సొసైటీ సభ్యులు మోయిన్ అద్నాన్, గ్రంథాలయం ఇన్‌చార్జీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి చేనును ధ్వంసం చేసిన అడవిపందులు

దహెగాం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖర్జీ గ్రామానికి చెందిన పుల్లం రాజయ్య పత్తిచేనులో అడవి పందులు బుధవారం రాత్రి పత్తి ధ్వంసం చేసినట్లు బాధితుడు తెలిపారు. రెండు ఎకరాల్లో పత్తిపంట సాగు చేయగా ఒక ఎకరం పూర్తిగా ధ్వంసం అయినట్లు రైతు వాపోయాడు. అటవీ అధికారులు తమను ఆదుకోవాలని వేడ్కొంటున్నాడు.

ప్రభుత్వ బడులకు కొత్త కళ..

● జిల్లాలో విధుల్లో చేరిన 270మంది నూతన ఉపాధ్యాయులు

చింతలమానేపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వబడుల్లో నూతన ఉపాధ్యాయులు ఈనెల 16న విధుల్లో చేరడంతో ప్రభుత్వబడులు నూతన కళను సంతరించుకున్నాయి. ప్రభుత్వ బడుల్లో ఇకపై విద్యా ప్రమాణాలు మెరుగుపడి విద్యార్థులకు నాణ్యమైనవిద్య అందే అవకాశం ఉంది. ఇన్నేళ్లు ఒకే ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయులు లేని పాఠశాలలుండగా విద్యార్థులు వారి తల్లిదండ్రులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఇకపై వారి బాధలు తీరనున్నాయి. నూతనంగా జిల్లాలో 270మంది ఉపాధ్యాయులు విధుల్లో చేరారు.

జిల్లాలో 579ప్రాథమిక పాఠశాలలు, 188ప్రాథమికోన్నత పాఠశాలలు, 113జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలున్నాయి. ప్రభుత్వం డీఎస్సీ పరీక్ష అనంతరం 61 రోజుల్లో ఫలితాలు ప్రకటించి ఈనెల 2-5వరకు 1:3పద్ధతిలో ధ్రువపత్రాలు పరిశీలించారు. అనంతరం 8వ తేదీన అభ్యర్థులను ఎంపిక చేసింది. 9న సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా నియామకపత్రాలు అందుకున్న 270 మంది నూతన ఉపాధ్యాయులు ఇందులో ఎస్జీటీలు 176 మంది, 96మంది స్కూల్‌అసిసెంట్లు డీఈవో కార్యాలయంలో రిపోర్ట్ చేసి విధుల్లో చేరారు. వారికి కౌన్సెలింగ్ నిర్వహించిన అనంతరం ఈనెల 16న విధుల్లో చేరారు.

బాధ్యతతో విధులు..

డీఎస్సీ-2024ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన వారు తొలిరోజు విద్యార్థులకు పాఠాలు బోధించి తమ ఇన్నేళ్ల కష్టానికి ఫలితం దక్కిందని ఆనందపడ్డారు. ఉద్యోగం కోసం అహర్నిశలు కష్టపడి అనుకున్న లక్ష్యాన్ని సాధించిన నూతన ఉపాధ్యాయులు.. భావి పౌరులుగా ఎదిగే విద్యార్థులకు మార్గదర్శకులుగా నిలవ నున్నారు. సర్కార్ బడుల బలోపేతానికి.. పేదమధ్య తరగతి పిల్లలకు నాణ్యమైన విద్య అందించడానికి కృషిచేయ నున్నారు. ప్రపంచం వేగంగా మారిపోతోంది. కొత్తగా ఆలోచనలతో ముందుకు సాగే విద్యార్థులే ఈ పోటీల్లో దూసుకెళ్తున్నారు. విద్యార్థులు బట్టీ చదువులకు పరిమితం కాకుండా కొత్త ఆలోచనలు చేసేలా ప్రోత్సహి స్తామని బాధ్యతతో విధులు నిర్వహి స్తామని నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.



విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతా..



మాది చింతలమానేపల్లి మండలంలోని దిందా గ్రామం. అమ్మా-నాన్న వ్యవసాయం చేస్తారు. ఉపాధ్యాయకొలువే లక్ష్యంగా చదివాను. డీఎస్సీ2024లో స్కూల్‌అసిస్టెంట్ బయోలాజికల్ సైన్స్‌విభాగంలో 75.20స్కోర్ సాధించి జిల్లాలో 3వర్యాంక్ సాధించా. గూడెం జడ్పీ ఉన్నతపాఠశాలలో విధుల్లోచేరాను. మొదటిరోజు విధుల్లోచేరిన సందర్భంలో ఆనందానికి అవధుల్లేవు. చాలాసంతోషంగా అనిపించింది. కష్టానికితగ్గ ఫలితం వచ్చింది. విద్యార్థుల నుసైతం ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తా. ఇప్పటినుంచే విద్యార్థులకు పోటీపరీక్షల్లో అవసరమైన మెలకువలు నేర్పేందుకు కృషి చేస్తా.

- నికాడి దిలీప్, స్కూల్ అసిస్టెంట్, గూడెం (జడ్పీ ఉన్నత పాఠశాల)

కొత్త ఆలోచనలతో ముందుకు..



మాది చింతలమానేపల్లి మండలం కర్జెల్లి గ్రామం. మానాన్న, అన్నయ్యల ప్రోత్సాహంతో చదివాను. ఉపాధ్యాయ వృత్తిపట్ల ఉన్న గౌరవంతో ఉపాధ్యాయుడిగా పనిచేయాలన్న సంకల్పంతో చదివాను. అనుకున్నట్లే డీఎస్సీ-2024లో ఎస్జీటీలో 77.47 స్కోర్ వచ్చింది. జిల్లాలో 44వ ర్యాంక్ సాధించా. మొదటి రోజు విధుల్లో చేరిన సందర్భం మరువలేనిది. విద్యార్థులకు కొత్త ఆలోచనలతో విద్యనందిం చేందుకు కృషిచేస్తా. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకశ్రద్ధ చూపుతూ నాణ్యమైన విద్యనందించేందుకు నా వంతు కృషి చేస్తా.

- చౌదరి ప్రశాంత్, ఎస్జీటీ, రుద్రాపూర్ (ప్రాథమికోన్నత పాఠశాల)

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


రాజేష్ కార్వా (ఫైల్)

బెల్లంపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బెల్లంపల్లి పట్టణానికి చెందినరాజేష్ కార్వా (45) ఆటో మొబైల్ వ్యాపారి గురువారం మృతి చెందాడు. బుధవారం రాత్రి బెల్లంపల్లి నుంచి హైద్రాబాద్‌కు కారులో వెళ్తుండగా గురువారం తెల్లవారుజామున గజ్వేల్ జిల్లా కుక్కునూరుపల్లి గ్రామ సమీపంలో కారు అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో రాజేష్ కార్వా తలకు, ఛాతి భాగంలో తీవ్ర గాయాలు కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం బెల్లంపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. రాజేష్ కార్వా మృతితో పట్టణంలోని వ్యాపారులు బంద్ పాటించారు.

మంచిర్యాలలో...

మంచిర్యాల అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సున్నంబట్టివాడలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏటకారి వెంకటేష్ (38) మృతి చెందినట్లు పట్టణ ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మృతుడు బుధవారం రాత్రి వంద ఫీట్ల రోడ్డు నుంచి వెళ్తుండగా మంచిర్యాల నుంచి సీసీసీ వైపు వెళ్తున్న ఆటో బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో వెంకటేష్‌కు తీవ్రగాయాలు కాగా కుటుంబసభ్యులు ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి వైద్యం అందిస్తుండగా మృతి చెందాడు. మృతుడి భార్య సృజన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

వివాహిత అదృశ్యం

భీమారం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): భీమారం పంచాయతీ రిధిలోని పద్మశాలివాడకు చెందిన బండి స్వప్న అనే మహిళ అదృశ్యమైనట్లు ఎస్‌ఐ రాములు గురువారం తెలిపారు. స్వప్నకు కొన్ని రోజుల నుంచి మతి స్థిమితం లేకుండా ప్రవర్తిస్తోంది. బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. బంధువుల ఇండ్లలో వెతికినా ఆచూకీ దొరకలేదు. భర్త ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

కోటపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని గురువారం మండల కేంద్రంలో పట్టుకున్నట్లు ఎస్‌ఐ రాజేందర్ తెలిపారు. మహారాష్ట్రలో త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నిర్వహిస్తున్న తనిఖీల్లో భాగంగా ఆటో, బొలేరో ట్రాలీలో మహారాష్ట్రకు తరలుతున్న మద్యాన్ని ఏదులబంధం గ్రామ సమీపంలో పట్టుకున్నామన్నారు. పారుపెల్లి వైన్‌షాపు నుంచి కొనుగోలు చేసిన రూ. 3,01,542 విలువైన మద్యాన్ని పట్టుకుని వాహనాలను కోటపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులతో పాటు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

గిరిజన యువతికి న్యాయం చేయాలి



నెన్నెల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మైలారం గ్రామానికి చెందిన గిరిజన యువతి జంబి అంజలికి న్యాయం చేయాలని ఐహెచ్‌ఆర్‌సీ రాష్ట్ర అధ్యక్షురాలు లీలాదేవి డిమాండ్ చేశారు. గొళ్లపల్లికి చెందిన రేశబోయిన రాజశేఖర్ ప్రేమ పేరిట అంజలిని మోసం చేశాడన్నారు. యువకుడి ఇంటి ఎదుట బైఠాయించి పది రోజులుగా న్యాయపోరాటం చేస్తున్న యువతికి గురువారం మద్దతు ప్రకటించారు. ఆమె మాట్లాడుతూ బాధిత యువతి పోలీసులను, ఎమ్మెల్యేను ఆశ్రయించినప్పటికి న్యాయం జరగలేదన్నారు. నిందితుడికి అధికార పార్టీ నాయకుల అండ ఉందన్నారు. యువతికి న్యాయం జరిగే వరకు పోరాడతామన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు శైలెందర్‌సింగ్, బీఆర్‌ఎస్ నాయకులు ప్రేమ్‌సాగర్, రమేష్ ఆమె వెంట ఉన్నారు.

వైన్‌షాపు నిర్వాహకుడికి జరిమానా

మందమర్రిటౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కనకదుర్గ వైన్‌షాపు నిర్వాహకుడికి గురువారం రూ.2 వేల జరిమానా విధించారు. వైన్‌షాపులో మద్యం కొనుగోలు చేసి సిట్టింగ్ షాపులో కూర్చుని చికెన్ పకోడి ఆర్డరు ఇచ్చాడు. చికెన్ దుర్వాసన వస్తుందని చెప్పినప్పటికీ యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ అధికారులు వైన్ షాపు యాజమానికి జరిమానా విధించారు.

గ్రామానికి చేరుకున్న మృతదేహం

జన్నారం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): చింతగూడ గ్రామానికి చెందిన రాయమల్లు ఇటీవల కుర్దిస్తాన్‌లో మృతి చెందగా 57 రోజుల తర్వాత మృతదేహం మండలానికి చేరుకుంది. ఆగస్టు 21న కుర్దిస్తాన్ ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రాయమల్లు మృతిచెందాడు. రాయమల్లు మృతదేహాన్ని తీసుకురావడంలో ఇరాక్‌లో బత్తుల ఎల్లస్వామి, ఇరాక్‌లో ఉంటున్న చింతగూడ యువకులు కీలక పాత్ర పోషించారు. రాయమల్లు మృతికి చింతగూడ గల్ఫ్ అసోసియేషన్ నాయకులు సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ వినయ్‌కుమార్, మురళీధర్‌రెడ్డి,మాజీ సర్పంచులు సంతాపం తెలిపి నివాళులర్పించారు.

ఘనంగా వాల్మీకి జయంతి


వాంకిడిలో నివాళులు అర్పిస్తున్న గంగపుత్రులు

వాంకిడి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఆదికవి, రామాయణ రచయిత వాల్మీకి జయంతిని గురువారం వాంకిడి మండల కేంద్రంలోని బెస్తవాడలో గంగపుత్రసంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా జెండాఎగురవేసి ఆయన చిత్రపటా నికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తుకారాం, నాయుకలు రామ, బిక్కాజీ, శ్రావణ్, దినకర్, తిరుపతి, బాపురావు, తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: రెబ్బెన జీఎం కార్యాలయంలోని కాంప్లెక్సులో గురువారం మహర్షి వాల్మీకి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్ర మంలో జీఎం ఎం శ్రీనివాస్, ఎస్‌వోటు జీఎం రాజమల్లు, పర్సన్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, డీజీఎం(ఐఇ) బెహర తదితరులు పాల్గొన్నారు.

మినిమం టైం స్కేల్ అమలు చేయాలి

రెబ్బెన, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖ ఏకోపాధ్యాయ ఆశ్రమపాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్స్(సీఆర్టీ)కు మినిమం టైం స్కేల్ అమలు చేయాలని సీఆర్టీలు గురువారం మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా గిరిజనసంక్షేమ ఐటీడీఏ పరిధిలో చాలీచాలని వేతనాలు తీసుకుంటూ మారుమూల ప్రాంతాల్లోని గిరిజన పిల్లల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. తమకు మినిమం టైంస్కేల్ అమలుచేసి ఆదుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీఆర్టీలు శ్రీనివాస్, విజేష్, గణపతి, నగేష్, గణపతి, వెంకటేశం, గోపాల్, రవీందర్, ప్రభాకర్, రజనీకాంత్ తదితరులున్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సమావేశాల పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

కాగజ్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నవంబరు 2, 3 తేదీల్లో కాగజ్‌నగర్‌లో జరిగే ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలను విజయవంతం చేయాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు గురువారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ మాట్లాడుతూ నిరంతరం విద్యారంగ, సామాజిక సమస్యపై ఎస్‌ఎఫ్‌ఐ సంఘం ముందు ఉండీ పోరాడుతుందన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి చాపిలే సాయికృష్ణ మాట్లాడుతూ విద్యారంగంలో నెలకొన్న సమస్యలపై భవిష్యతులో చేసే పోరాటలపై కార్యచరణ రూపొందించేందుకు నవంబరు 2, 3 తేదీల్లో కాగజ్‌నగర్‌లో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లాఅధ్యక్షుడు వసాకే సాయికుమార్, సుంకరి సాయి, నితీష్, అయూబ్, భీంరావు తదితరులు పాల్గొన్నారు.

అనుమతి రద్దు చేయాలి

రెబ్బెన, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం నంబాల గ్రామంలోని వాగుకు ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూమిలోని 400ఈత చెట్ల తొలగింపు అనుమతి రద్దుచేయాలని గురువారం జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారికి గౌడ కులస్థులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంబాల ఎల్లమ్మ ఆలయం పక్క వాగు పరివాహక ప్రాంతంలో ఈతచెట్ల పైనే గౌడకులస్థులు జీవనోపాధి ఆధారపడి ఉందని వివరించారు. ఈత చెట్లు ఉన్న భూమిని ఓ ప్రజాప్రతినిధి చదును చేసినట్టు తెలిపారు. ఈత చెట్ల తొలగింపు అనుమతి వెంటనే రద్దు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో నంబాల గీత కార్మిక సంఘం సభ్యులు రామాగౌడ్, తిరుపతిగౌడ్, రవిగౌడ్, గౌడ సంఘం సభ్యులు రంగు మహేష్ గౌడ్, మల్లేష్ గౌడ్ తదితరులున్నారు.

వర్షాలు కురవాలని పూజలు


చిలుకయ్య గుట్టకు వెళ్తున్న గ్రామస్థులు

పెంచికలపేట, అక్టోబరు 17: వర్షాలు లేక వరి, మిరప, పత్తిపంటలు ఎండిపోతున్నాయి. ఈ నేపథ్యంలో గుంట్లపేట గ్రామంలో గొంతెమ్మ దేవరకు పోతెపల్లి, బొంబాయి గూడ,ముట్లగూడ, ఎర్రగుంట తదితర గ్రామాల రైతులు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం కడంబ అటవీ ప్రాంతంలోని చిలుకలయ్య గుట్టకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు కరుణించాలని కోరుతూ మహిళలు గ్రామదేవతలకు జలాభిషేకం చేశారు.



వేగంగా బొగ్గు రవాణా చేయాలి: డైరెక్టర్


వివరాలు తెలుసుకుంటున్న డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి

శ్రీరాంపూర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): నిర్ధేశిత లక్ష్యానికి అనుగుణంగా ఉత్పత్తిచేసిన బొగ్గును వేగంగారవాణా చేయాలని సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్) జి వెంకటేశ్వర్‌రెడ్డి ఆదేశించారు. గురువారం ఆయన శ్రీరాంపూర్ ఓసీపీని సందర్శించి, జీఎం కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. సీఆర్‌ఆర్, జీవీఆర్ ఓబీ కాంట్రాక్టు ప్రతినిధులు అధికారుల ఆదేశాల మేరకు నిర్ధేశిత ఓబీని తొలగించాలన్నారు. ఏ నెలకు ఆ నెల లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. అవసరమైన యంత్ర సామగ్రిని సమకూర్చుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం సత్యనారాయణ, శ్రీరాంపూర్, ఇందారం ఓసీపీల ప్రాజెక్టు అధికారులు టి శ్రీనివాస్, ఏవీరెడ్డి, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవులు, ఎస్టేట్స్ మేనేజర్ వరలక్ష్మీ, ఓసీపీ మేనేజర్ బ్రహ్మాజీ, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్ రెడ్డి, సర్వే అధికారి సంపత్ పాల్గొన్నారు.

బీఎంఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

శ్రీరాంపూర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బీఎంఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశం గురువారం యూనియన్ కార్యాలయంలో జరిగింది. ముఖ్య అతి థిగా అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, ప్రధాన కార్యదర్శి యతిపతి సారంగపాణి విచ్చేశారు. యూనియన్ కార్యకలాపాల గురించి చర్చించారు. అనంతరం శ్రీరాంపూర్ ఏరియా కార్యదర్శిగా రాగం రాజేందర్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా గోళ్ల మహేందర్, శాంతం సంపత్‌ను నియమించారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్ రెడ్డి, నాయకులు భోంపల్లి రమేష్, బోయిన మల్లయ్య, జల్ల తిరుపతి, గోళ్ల మహేందర్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కార్మికులపై ఆంక్షలు విధించడం సరికాదు



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకుడు సలేంద్ర సత్యనారాయణ

మందమర్రి టౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కార్మికులపై ఆంక్షలు విధించడం సరికాదని ఏఐటీయూసీ బ్రాంచికార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, సహాయ కార్యదర్శి కంది శ్రీనివాస్, ఏరియా కార్యదర్శి భీమనాథుని సుదర్శన్ అన్నారు. గురువారం ఏరియాలోని కేకే5గనిపై, ఏరియాస్టోర్స్‌లో నిర్వహించిన గేట్‌మీటింగ్‌లలో వారు కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. కార్మిక కుటుంబాల్లో ఎవరైనా అనారోగ్యంపాలైనా, ఇతర సమస్యలున్నా విధులకురారని, దీనిని ఆసరాగా చేసుకొని జీఎంను కలవమని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. కొత్తకొత్త సర్క్యు లర్‌లు జారీచేస్తూ కార్మికులను వేధింపులకు గురిచేయడం సరికాద న్నారు. ఈ విధానాన్ని ఉపసంహరించుకోవాలని, లేనియెడలఆందోళన చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గాండ్ల సంపత్, రాంలాల్, బ్రహ్మరెడ్డి,అజయ్,భూమయ్య,రాజేషం,తదితరులు పాల్గొన్నారు.

కార్మికులపై నిర్బంధ విధానాలను మానుకోవాలి..

కార్మికులపై నిర్బంధ విధానాలను అమలు చేస్తేఊరుకునేది లేదని ఐఎన్‌టీయూసీ కేంద్రకమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య ఏరియా ఉపాధ్యక్షుడు దేవిభూమయ్య హెచ్చరించారు. గురువారం మందమర్రిలో వారు మాట్లాడుతూ గుర్తింపుసంఘం వైఫల్యంమూలంగానే ఇలాంటి సర్క్యులర్‌లు వస్తున్నాయని ధ్వజమెత్తారు. కావాలని కార్మికులు గైర్హాజరు కారన్నారు. ఈ సర్క్యులర్ రద్దు చేయాలని కోరుతూ ఇన్‌చార్జీ జీఎం రాజేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు.

కాసిపేట: అనవసరమైన ఆంక్షలు విధిస్తూ కార్మికులను ఒత్తిడిచేయడాన్ని నిరసిస్తూ గురువారం కాసిపేట 2వగనిపై ఏఐటీయూసీ నాయకులు బైఠాయించి నిరసన తెలిపారు. ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్‌కార్యదర్శి దాగం మల్లేష్ మాట్లాడుతూ కార్మికులు మూడురోజులు గైర్హాజరైతే జీఎం కార్యా లయం నుంచి అనుమతి పత్రాన్ని తీసుకురావాలని నిబంధన విధించడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఈ విధానాలను మానుకోకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం గని మేనేజర్ లక్ష్మీనారాయణ అక్కడికి చేరుకుని నిబంధనలను ఎత్తివేస్తున్నామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో నాయకులు గొల్ల శ్రీనివాస్, బొద్దున వెంకటేష్, నర్సయ్య, సుధాకర్, కార్మికులు పాల్గొన్నారు.

సింగరేణి జోనల్ రెస్క్యూ పోటీల విజేత ఆర్జీ-2,3, ఏపీఏ జట్టు

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 17: 53వ జోనల్ రెస్క్యూపోటీల విజేతగా ఆర్జీ-2, 3 ఏపీఏ జట్టు నిలిచింది. రెస్క్యూ పోటీల ముగింపు కార్యక్రమం గురువారం రాత్రి రెస్క్యూస్టేషన్‌లో జరిగింది. రెండు రోజుల పాటు జరిగిన పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చి టీం ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచి ఆర్జీ-2, 3 ఏపీఏ ప్రథమ బహుమతి సాధించింది. భూపాలపల్లి జట్టు ద్వితీయ బహుమతి సాధించగా, తృతీయస్థానంలో బెల్లంపల్లి, మందమర్రి జట్టు నిలిచింది.

విభాగాల వారీగా బహుమతులు పొందిన జట్లు..

బెస్ట్ డ్రిల్ అండ్ పెరేడ్- ఆర్జీ-1, బెస్ట్ థియరీ స్టాట్యుటరీ - ఆర్జీ-2, 3, ఏపీఏ జట్టు బెస్ట్ రెస్క్యూ రిలే- ఆర్జీ-1, బెస్ట్ ట్యాటుటరీ- శ్రీరాంపూర్, బెస్ట్ ఫస్ట్ ఎయిడ్- మందమర్రి, బెస్ట్ ఎయిర్‌బేస్- ఇల్లందు, మణుగూరు, కొత్తగూడెం జట్టు, బెస్ట్ రికవరీ- మందమర్రి, బెల్లంపల్లి జట్టు, బెస్ట్ రెస్క్యూ రికవరీ- ఆర్జీ-2,3 ఏపీఏ జట్టు.

అనవసర విమర్శలు చేస్తే ఊరుకోం: ఐఎన్‌టీయూసీ

శ్రీరాంపూర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎమ్మెల్యేలను, ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ బి జనక్ ప్రసాద్‌ను విమర్శిస్తే ఊరుకునేది లేదని యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు జె శంకర్‌రావు అన్నారు. ఎస్‌ఆర్పీ3 గనిపై నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్‌ఎస్‌పార్టీ పదేండ్లు అధికారంలో, టీబీజీకేఎస్ గుర్తింపు సంఘంగా 12 ఏండ్లు ఉన్నప్పుడు సింగరేణిని అంధకారం చేశారని విమర్శించారు. కార్మికుల తిరస్కారానికి గురైనప్పటికీ బుద్ధి రావడం లేదన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీ యూసీ జాతీయసమితి సభ్యుడు భీంరావు, కేంద్ర ఉప ప్రధానకార్యదర్శి గరిగె స్వామి, ఉపాధ్యక్షుడు కలవేణ శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సత్యనారాయణ

జైపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న మల్టీపర్పస్ వర్కర్ల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ఎంపీడీవో సత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం కార్యదర్శులతో ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీల ఖాతాల వివరాలు, ఉన్న నిధుల వివరాలను సంబంధిత ప్రొఫార్మాలో పొందుపర్చాలన్నారు. గ్రామపంచాయతీల్లో నర్సరీల ఏర్పాటు పూర్తి చేయాలని, గ్రామపంచాయతీ ట్రాక్టర్ ఈఎంఐల చెల్లింపులు చేపట్టాలన్నారు. ఇంటి పన్నుల వసూళ్లను వేగవంతంగా వంద శాతం పూర్తి చేయాలన్నారు. ఎంపీవో శ్రీపతి బాపురావు, ఏపీవో వె ంకటేష్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

కల్వర్టు కట్టవద్దని కమిషనర్‌కు వినతి

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హమాలీవాడలో భాగ్యలక్ష్మి చికెన్ సెంటర్ సమీపంలో కల్వర్టును నిర్మించవద్దని 15వ వార్డు ప్రజలు గురువారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కల్వర్టు నిర్మాణం జరిగితే వినాయకుడి ఆలయం నుంచి నీరంతా తమ ఇంటి ఎదుట కాలువల ద్వారా ప్రవహిస్తుందని, ఇప్పటికే వర్షం కురిస్తే కాలువలోని నీరంతా రోడ్లపైకి వస్తోందన్నారు. వెంటనే కల్వర్టు నిర్మాణం నిర్ణయాన్ని మానుకోవాలని కోరారు.

ఉద్యానవన భూమి కబ్జాకు యత్నం

జైపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని హార్టికల్చర్ నర్సరీలో భూమిని కబ్జా చేసిన వారిని తహసీల్దార్ వనజారెడ్డి, సిబ్బంది గురువారం అడ్డుకున్నారు. హార్టికల్చర్‌లోని సర్వే నెంబరు 94లోని దాదాపు 8 ఎకరాల భూమిని కబ్జా చేసేందుకు రెవెన్యూ శాఖలో పనిచేసిన మాజీ పట్వారీ, మరి కొందరు పట్టా చేయించుకుని కోర్టు నుంచి ఆర్డర్లు తెచ్చుకున్నామని గురువారం నర్సరీ గేటుకు తాళం వేశారు. లోపల ఎక్స్‌కావేటర్‌తో ట్రాక్టర్లతో దున్నుతుండగా సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ వనజారెడ్డి సిబ్బందితో వెళ్లి అడ్డుకున్నారు. రెవెన్యూ రికార్డులను పరిశీలించిన తర్వాత భూమి ఎవరిదో తేలుతుందన్నారు. ఉద్యానవన నర్సరీని కాపాడాలని కోరారు.





ధ్వంసమైన జంతువుల బొమ్మలు



పట్టణంలోని పార్కు ముఖ ద్వారం



పార్కులపై పట్టింపేది..?

- ఆకతాయిలకు అడ్డాలుగా మారుతున్నవైనం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

బెల్లంపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని అందించి సేద తీర్చేపార్కులను మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో అవి నిరుపయోగంగా మారుతున్నాయి. మరో వైపు పార్కులపై పర్యవేక్షణ కొరవడడంతో ఆకతాయిలకు, మందుబాబులకు అడ్డాలుగా మారుతున్నాయి. పట్టణంలో పట్టణ ప్రగతి నిధుల నుంచి గత ప్రభుత్వ హయాంలో రెండు పార్కులను ఏర్పాటు చేశారు. 3, 4 వార్డుల్లో పార్కులను ఏర్పాటు చేశారు. దాదాపు రూ. 80 లక్షల వ్యయంతో ఈ పార్కుల్లో పిల్లల ఆట వస్తువులు, సేద తీరడానికి కుర్చీలు, బెంచీలు, ఆకర్షించే వివిధ జంతువుల బొమ్మలు, వివిధ రకాల చెట్లను ఏర్పాటుచేశారు. పార్కులు ప్రారంభించిన సమయంలో పట్టణ ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లో కుటుంబీకులతో , పిల్లలతో పార్కులకు వచ్చి గడిపేవారు. గత కొన్ని నెలల నుంచి ఈపార్కులను మున్సిపల్, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ప్రజలు పార్కులకు రాలేకపోతున్నారు. ఈ పార్కుల నిర్వహణ సక్రమంగా లేకపోవడం, గతంలో చిన్నారుల ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన పరికరాలు ధ్వంసం కావడం, పిచ్చి మొక్కలు పెరగడం, చుట్టూ ప్రహరీ లేకపోవడంతో పార్కులు కళావిహీనంగా మారాయి. అంతేకాకుండా గతంలో ఈ పార్కుల్లో నాసిరకమైన వస్తువులు ఏర్పాటు చేయడంతో ప్రస్తుతం జంతువుల బొమ్మలు, పిల్లల ఆట పరికరాలు చెడిపోయాయని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకుని పార్కుల నిర్వహణ సక్రమంగా చేపడితే ఆహ్లాదకరంగా ఉంటుందని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



పార్కుల నిర్వహణ సరిగ్గాచేయడం లేదు



పట్టణంలోని పార్కుల నిర్వహణను సంబంధిత అధికా రులు సరిగ్గా చేయడం లేదు. దీంతో పార్కుల్లోకి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నాం. అలాగే రాత్రి సమయంలో పార్కులు మందు బాబులకు అడ్డాగా మారుతున్నాయి. ఉదయం పార్కులకు వెళితే బీరు సీసాలు, ఖాళీ మందు బాటిళ్లు దర్శనమిస్తున్నాయి. పార్కుల నిర్వహన సరిగ్గా చేపట్టాలి.

- రాజేంద్ర ప్రసాద్, బెల్లంపల్లి

క్రీడల్లో రాణిస్తున్న శివకృష్ణ

- కోలిండియా పోటీల్లో హాకీలో గోల్డ్‌మెడల్
- స్పోర్ట్స్ కోఆర్డినేటర్‌గా నియమించిన యాజమాన్యం



అధికారుల నుంచి ప్రశంస పత్రం అందుకుంటున్న శివకృష్ణ

మందమర్రి టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మందమర్రి ఏరియాలోని కేకే 5 గనిలో సీనియర్ మైనింగ్ సర్దార్‌గా పని చేస్తున్న ఏరియా కోఆర్డినేటర్ శివకృష్ణ క్రీడల్లో రాణిస్తున్నారు. ఏరియా, రీజియన్‌తోపాటు కోల్ ఇండియా స్థాయిలో రాణిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. 2016లో డిప్లమా పూర్తి చేసిన శివకృష్ణ సింగరేణికి ఎంపికయ్యారు. క్రీడల్లో ఆసక్తి ఉన్న ఆయన కోల్ ఇండియా పోటీల్లో పాల్గొన్నారు. 100 మీటర్లు, 200 మీటర్లు, హాకీ, క్రికెట్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్‌లో శివకృష్ణకు ప్రావీణ్యం ఉంది. రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా పథకాలు సాధించాడు. గతేడాది కోల్ ఇండియా స్థాయి భూపాలపల్లిలో జరిగిన హాకీ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించాడు. ఇతర అథ్లెటిక్‌కు సంబంధించి నాలుగు సార్లు ఎంపికయ్యాడు. ఆయన సాధించిన పథకాలతో సింగరేణి యాజమాన్యం ఏరియా స్పోర్ట్స్ కోఆర్డినేటర్‌గా ఎంపిక చేసింది. క్రీడాకారులను వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్నారు.



కోల్ ఇండియా హాకీ పోటీల్లో కప్పుతో శివకృష్ణ

సింగరేణి ప్రోత్సాహం మరువలేనిది : శివకృష్ణ

సింగరేణి యాజమాన్యం ప్రోత్సహంతోనే క్రీడల్లో పతకాలు సాధిస్తున్నా. దీంతో యాజమాన్యం 2024-25 ఆర్థిక సంవత్సరానికి స్పోర్ట్స్ కోఆర్డినేటర్‌గా ఎంపిక చేసింది. సింగరేణి క్రీడాకారులు కోల్ ఇండియాలో పతకాలు సాధించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం. ఈసారి తప్పకుండా కోల్ ఇండియాలో పథకాలు సాధించే లక్ష్యంగా దృష్టి పెట్టాం.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మందులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్

జన్నారం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : వైద్యులు, సిబ్బంది సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. మందులు, వ్యాక్సిన్‌లను, రిజిష్టర్‌లను తనిఖీ చేశారు. రోజు వారీ ఓపీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. పిల్లలకు వ్యాక్సినేషన్ క్రమం తప్పకుండా చేయాలన్నారు. మండల వైద్యురాలు ఉమాశ్రీ, సిబ్బంది ఉన్నారు.


ముగిసిన పోలీస్ స్పోర్ట్స్‌మీట్



విజేతలకు బహుమతులు అందిస్తున్న కమాండెంట్ వెంకటరాములు

హాజీపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : గుడిపేట 13వ బెటాలియన్‌లో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న పోలీస్ స్పోర్ట్స్‌మీట్ క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. పోలీసులను వివిధ గ్రూపులుగా విభజించి పరుగు పందెం, లాంగ్‌జంప్, హైజంప్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో, టగ్ ఆఫ్ వార్, వాలీబాల్, క్రికెట్ పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలిచిన విజేతలకు బెటాలియన్ కమాండెంట్ వెంకటరాములు బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా శారీరక ధృడత్వం, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. అసిస్టెంట్ కమాండెంట్‌లు నాగేశ్వర్‌రావు, కాళిదాసు, అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో ఫెన్సింగ్ క్రీడ అభివృద్ధికి కృషి



పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

శ్రీరాంపూర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఫెన్సింగ్ క్రీడ అభివృద్ధికి కృషి చేస్తామని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఫౌండర్, ఒలింపిక్ అసోసియేషన్ కోశాధికారి కనపర్తి రమేష్ అన్నారు. ఫెన్సింగ్ అసోసియేషన్, స్కూల్ గేమ్స్ క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అండర్ 14, 17, 19 బాలుర, బాలికల ఎంపిక పోటీలు శ్రీరాంపూర్‌లోని సీఈఆర్ క్లబ్‌లో జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ఈ క్రీడ ద్వారా విద్య, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. జిల్లాలో ఫెన్సింగ్ క్రీడ అభివృద్ధికి విరివిగా పోటీలు నిర్వహిస్తామని జిల్లా అధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ అన్నారు. స్కూల్ గేమ్స్ క్రీడా సమాఖ్య కార్యదర్శులు చెరుకు ఫణిరాజా, బాబురావు, ఫెన్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆవునూరి మహేష్, చెరుకు అనిల్, సీనియర్ క్రీడాకారులు ఈదునూరి వెంకటేశ్, ఎర్ర కిశోర్, పీఈటీలు రాజేందర్, కుమార్, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా సుధాకర్

గర్మిళ్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్టార్ మంచిర్యాల జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా పుల్లూరి సుధాకర్‌ను నియమిస్తూ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ప్రధాన కార్యదర్శి పుల్లెల గోపీచంద్ గురు వారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు సంబంధించిన నియామకపత్రాన్ని అసోసియేషన్ సీనియర్ ఉపాధ్యక్షుడు ఉపేందర్‌రావు సుధాకర్‌కు నియామక పత్రం అందించారు. బ్యాడ్మింటన్ క్రీడ అభివృద్ధికి కృషి చేస్తానని సుధాకర్ తెలిపారు.



నియామకపత్రం అందుకుంటున్న సుధాకర్

వ్యవసాయం

నేల రకాన్ని బట్టి పత్తి విత్తన సాగు ఎంచుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి కల్పన

కాసిపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులు నేల రకాన్ని బట్టి విత్తన యాజమాన్యసాగు పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధిస్తారని జిల్లా వ్యవసాయాధికారి కల్పన అన్నారు. గురువారం నాగ్‌పూర్ జాతీయ పత్తి పరిశోధన సంస్థ బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం నిర్వహించిన అధిక సాంద్రత-పత్తిలో క్షేత్ర దినోత్సవం కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. చీడపీడల నివారణపై రైతులు అవగాహన కలిగి ఉండాలని, వ్యవసాయాధికారులు చెప్పిన సూచనలను పాటించాలని సూచించారు. అనంతరం కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ శివకృష్ణ మాట్లాడుతూ జాతీయ పత్తి పరిశోధన సంస్థ రైతులకు యాజమాన్య పద్ధతులపై పత్తి రైతులకు శిక్షణ ఇస్తుందన్నారు. జాతీయ ఆహార భద్రత మిషన్ కింద ఉత్తమ పద్ధతుల ద్వారా పత్తి ఉత్పాదకతను పెంచేలా జిల్లా వ్యాప్తంగా 187 ఎకరాల్లోని రైతు క్షేత్రాల్లో ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. దీని ద్వారా రైతులు పత్తి సాగులో మెళకువలు నేర్చుకుంటారని తెలిపారు. అనంతరం పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త సునీల్ మహాజన్ అధిక సాంద్రత పత్తి సాగు ప్రాముఖ్యత, నేల రకాలు, విత్తన ఎంపిక, చీడపీడల నివారణ గురించి వివరించారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు తిరుపతి, నాగరాజు, రాజనరేందర్, మండల వ్యవసాయాదికారి ప్రభాకర్, జాతీయ పరిశోధన సంస్థ అధికారులు సొలానే , ప్రియాంక, అనిల్, శైలజ, రైతులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు శిక్షణ



అవగాహనకల్పిస్తున్న అధికారులు

కోటపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లంపేట రైతువేదికలో గురువారం ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్ పామ్ సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ పత్తి, వరి పంటలే కాకుండా ఆయిల్‌పామ్ సాగు వల్ల అధిక లాభాలు ఆర్జించవచ్చని తెలిపారు. అంతర పంటలను సాగు చేయవచ్చన్నారు. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహక రాయితీ అందుతుందన్నారు. డీహెచ్‌ఎస్‌వో అనిత, హెచ్‌వో కళ్యాణి, మ్యాట్రిక్స్ సీఈవో ఉదయ్‌కుమార్, ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ మధుకర్, రైతులు, తదితరురలు పాల్గొన్నారు.

అర్హులంతా ఓటు హక్కు వినియోగించుకోవాలి

శ్రీరాంపూర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ అన్నారు. ప్రచారంలో భాగంగా గురువారం ఆయన ఆర్కే 7, ఆర్కే న్యూటెక్ గనులపై యువ కార్మికులను కలిసి ఓటు అభ్యర్థించారు. ఓటరుగా నమోదుకు తమ కార్యాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. 9160603222 నెంబర్‌లో సంప్రదిస్తే ఓటరుగా నమోదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్రం రమేష్, బింగి ప్రవీణ్ ఉన్నారు.

వైద్య శిబిరాలు

నస్పూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నస్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వివిధ వార్డుల్లో గురువారం వైద్య శిబిరాలు నిర్వహించారు. శిబిరంలో బీపీ, షుగర్ పరీక్షలు చేసి మందులు అందించారు. విలేజ్ నస్పూర్ రోడ్‌లో ప్రజలకు బీపీ, షుగర్ పరీక్షలు చేసి అవసరమైన మందులను పంపిణీ చేశారు. సీహెచ్‌వో రమేష్, ఏఎన్ఎం పుష్ప, ఆశ వర్కర్లు పావని, మల్లేశ్వరి పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలి

దండేపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పని సరిగా వేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ ధన్‌రాజ్ సూచించారు. గూడెంలో గురువారం 275 పశువులకు గాలికుంటువ్యాధి నివారణ టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మాజీ ఎంపీటీసీ తోట మోహన్, పశువైద్య సిబ్బంది స్వప్న, కుమార్, శ్రీనివాస్, ఉన్నారు.

అన్ని మతాలను గౌరవించాలి

- రాష్ట్ర మంత్రి సీతక్క



మాట్లాడుతున్న మంత్రి సీతక్క

కాసిపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మతం ఏదైనా మానవత్వాన్ని పెంపొందించి అన్ని మతాలను సమానంగా గౌరవించినప్పుడే ప్రపంచ శాంతి నెలకొంటుందని రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. గురువారం కల్వరి చర్చి నిర్వాహకులు ప్రవీణ్ కుమార్-షారోన్ నిర్వహించిన 50రోజుల ఉపవాస దీక్ష విరమణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. మతాల పేరుతో దేశంలో కొందరు రెచ్చగొట్టి విధ్వంసాలు సృష్టిస్తున్నారని, మతాలను రెచ్చగొట్టి ఇతర దేవుళ్లపై దాడులు చేయడం హేయమైన చర్య అని అన్నారు. మతాలను, దేవుళ్లను రాజకీయాల్లోకి లాగొద్దని, కాని కొందరు దేవుళ్లను రాజకీయ ఎజెండాలోనికి లాగి మత విశ్వాసాలపై దాడులు చేస్తున్నారన్నారు. ఇలాంటి చర్యలు సహేతుకమైనవి కావన్నారు. కల్వరి చర్చి నిర్వాహకులు ప్రవీణ్‌కుమార్ ప్రపంచ శాంతి కోసం ఉపవాస దీక్షలు చేయడాన్ని అభినందించారు. అనంతరం చర్చి నిర్వాహకులు అతిథులను సన్మానించారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, ఎంఎల్‌సీ దండె విఠల్, మాజీ మంత్రి వేణుగోపాల్ చారి, మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేతశ్రీధర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



ప్రార్థనలు చేస్తున్న చర్చి నిర్వాహకులు

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



జోడేఘాట్‌లో ఏర్పాటు చేసిన స్టాల్స్



జోడేఘాట్‌లో గుస్సాడీ కళాకారులు



జోడేఘాట్‌లో పూజలు నిర్వహిస్తున్న భీం వారసులు

కెరమెరి/ఆసిఫాబాద్/ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 17: కుమరం భీం 84వ వర్ధంతి సందర్భంగా కళాకారులు ప్రదర్శించిన సాం స్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గోండి భాషలో పాటలు పాడుతూ నృత్యా లు చేస్తూ చేసిన ప్రదర్శణలు అందరిని ఆకట్టుకున్నాయి. మహారాష్ట్ర రాష్ట్ర నుంచి వచ్చిన కళాకారులు, స్థానిక కళాకారులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కుమరంభీంపై రచించిన పాట సీడీలను మంత్రి అవిష్కరించారు.

స్టాళ్ల ఏర్పాటు..

దర్బార్‌లో ఆయా ప్రభుత్వ శాఖలు స్టాళ్లను ఏర్పాటు చేశారు. మెడికల్ అండ్ హెల్త్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, చిన్ననీటి పారుదల శాఖ, సఖీ, సమగ్ర గిరిజన అభివృద్ధి శాఖ, పంచాయతీరాజ్‌శాఖ, గిరిజన సంక్షేమశాఖ, డీఆర్‌డీఏలు తమ తమ స్టాళ్లను ఏర్పాటు చేసి ఫొటో గ్యాలరీలను ప్రదర్శణ చేపట్టారు. ఈ సందర్భగా దర్బార్‌లో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల విభాగాన్ని మంత్రి సీతక్క పరిశీలించారు.

భారీ బందో బస్తు..

వర్ధంతి సభకు రాష్ట్ర మంత్రి సీతక్కతో పాటు ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, పాల్వాయి హరీష్‌బాబు, కొక్కిరాల ప్రేంసాగర్ రావు, వెడ్మ బొజ్జు, ఎమ్మెల్సీ దండె విఠల్, జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ద శుక్ల, రామగుండం పోలీసు కమీషనర్ శ్రీనివాస్, ఎస్పీ డీవీ శ్రీనివాస్, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలాచారి తదితర ప్రముఖులు రావడంతో పోలీసులు గట్టి బందోబస్తును నిర్వహించారు. బాంబ్ స్క్వాడ్ బృందాలు అణువణువు తనిఖీలు చేపట్టారు. ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు ఆదేశాల మేరకు ఏఎస్పీ ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో సీఐలు, ఎస్సైలు, ప్రత్యేక పోలీసు బలగాలు భారీ బందో బస్తు నిర్వహించారు.



డప్పు వాయిద్యాలతో నృత్యం చేస్తున్న ఆదివాసీలు



జోడేఘాట్‌లో పూజలు నిర్వహిస్తున్న కలెక్టర్, ఎస్పీ, పీఓ, ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు



జోడేఘాట్‌లో భీం విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే కోవలక్ష్మి



పోరాట వీరుడికి ఘన నివాళి

- జనసంద్రం అయిన జోడేఘాట్
- వేలాదిగా తరలి వచ్చిన గిరి'జనం'
- మంత్రి సీతక్కతోపాటు పలువురు ప్రముఖుల నివాళులు

ఆసిఫాబాద్/ఆసిఫాబాద్‌రూరల్/ కెరమెరి, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం 84వ వర్ధంతి సందర్భంగా జోడేఘాట్ జనసంద్రం అయింది. రాష్ట్ర ప్రభుత్వం కుమరంభీం వర్ధంతిని అధి కారికంగా చేపట్టడంతో జోడేఘాట్‌కు వేలాదిగా గిరిజనులు తరలి వచ్చారు. గురువారంవర్ధంతి కార్యక్రమానికి రాష్ట్రపంచా యతీ రాజ్, స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క, ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్సీ దండెవిఠల్, ఎమ్మెల్యేలు కోవలక్ష్మి, పాల్వాయి హరీష్ బాబు, కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, వెడ్మబొజ్జు, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలాచారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా, ఆదనపు కలెక్టర్‌దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలె క్టర్ శ్రద్ధా శుక్ల, రామగుండంకమిషనర్ శ్రీనివాస్, ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు, కుమరంభీం మనుమడు సోనేరావు, టీపీసీసీ కార్యదర్శి, కరీం నగర్ గ్రంథాలయసంస్థ చైర్మన్ సత్తు మల్లేష్, ఆదివాసీ సంఘం నాయకులు పాల్గొని పోరాటయోధుడు కుమరంభీం విగ్రహానికి పూలమాలలు వేసి, ఆయనసమాధి వద్ద ఘన నివాళులు అర్పించారు. కుమరంభీం వర్ధంతికి ఉమ్మడిజిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతరరాష్ట్రాల నుంచి గిరిజనులు వేలాదిగా తరలివచ్చారు. భీం వర్ధంతి పండుగకు వాహనాల ద్వారా భారీసంఖ్యలో తరలివచ్చి ఉద్యమవీరునికి నివాళులు అర్పించారు. ఉదయం గిరిజనసంప్రదాయ రీతిలో కుమరంభీం మనుమడు సోనేరావు దంపతులు, భీంవారసులు సమాధివద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి జెండాలను ఆవిష్కరించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ రావు, నిర్వహణకమిటీ చైర్మన్ పెందూరురాజేశ్వర్, కన్వీనర్ పెందూరు మోతీరాం, మాజీజడ్పీటీసీలు అరిగెలనాగేశ్వర్‌రావు, ద్రుపద బాయి, అత్రంలక్ష్మణ్, కలాం, మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గౌడ్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు శ్యాంనాయక్, సుగుణక్క, ఆదివాసీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● మంత్రికి ఘన స్వాగతం..

కుమరం భీం వర్ధంతి సభకు జోడేఘాట్‌కు వచ్చిన మంత్రి సీతక్కకు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే కోవలక్ష్మి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా, ఎస్పీ డీవీ శ్రీనివాస్, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్ల, డీడీ రమదేవి, ఆదివాసి సంఘాల నాయకులు పుష్పగు చ్ఛాలు అందించి ఘన స్వాగతం పలికారు. గుస్సాడీ నృత్యాలు, భాజాభజంత్రీలతో మంత్రికి ఘన స్వాగతం పలికారు.

కుమరం భీం పోరాట ఫలితమే ఆదివాసీ చట్టాలు..
- మంత్రి సీతక్క



అనంతరం ఏర్పాటుచేసిన సభవేదికలో మంత్రి సీతక్క మాట్లాడుతూ కుమరంభీం పోరాటం, త్యాగాలు, ఈప్రాంత స్థితిగతులు తదితర అంశాలపై ఇంగ్లాండ్‌కు చెందిన మానవపరిణామ శాస్త్రవేత్త హైమన్‌డార్ఫ్ దంప తులు అధ్యయనంచేసి నివేదికలను ప్రభుత్వానికి పంపించడం ద్వారా అనాటి ప్రభుత్వాలు 5వషెడ్యూల్, పెసాచట్టం, 1/70,ఐటీడీఏ లాంటి చట్టాలు, జీవోలరూపకల్పన జరిగిందన్నారు. పోడుభూముల హక్కులచట్టం రావడానికి భీం పోరాట ఫలితమే అన్నారు. రాంజీగోండ్, బీర్సాముండా, కుమరంభీం, సమ్మక్క- సారలమ్మ, ఇంద్రవెల్లి పోరాటలన్ని జల్, జంగల్, జమీన్ హక్కుల కోసం, స్వయంపాలన కోసమేనన్నారు. అదేస్వయంపాలన స్ఫూర్తితో తెలంగాణ ఉద్యమంకూడా రూపుదిద్దుకొని ప్రత్యేకరాష్ట్రంగా ఏర్పడిందన్నారు. తాను ఆది వాసీబిడ్డగా సమస్యలను దగ్గరుండి చూశాన న్నారు. ఐటీడీఏ రానురాను నిర్వీర్యం అవుతోం దని జిల్లాలు ఏర్పడ్డాక ఐటీడీఏలు నిర్లక్ష్యం చేశారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఐటీడీఏల బలోపేతానికి ప్రత్యేక దృష్టిసారిస్తున్నట్లు పేర్కొ న్నారు. జోడేఘాట్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు రూ.6కోట్లు మంజూరుచేస్తున్నట్లు ప్రకటించారు. త్వరలోనే నివేదికలను సమర్పిం చాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. జిల్లాలోని వట్టివాగు, కుమరంభీం ప్రాజెక్టుల అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. పోరుగడ్డలోని 12గ్రామాల్లో 350కుటుంబాలకు ఇందిరమ్మఇళ్లను మంజూరు చేస్తామన్నారు. ఆదివాసీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈప్రాంతంలో విద్యవైద్య రంగాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, జిల్లా అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వ యంతో కృషిచేయలన్నారు. సమస్యల పరిష్కా రంకోసం శాంతియుతంగా ముందుకుపోవాలని ఐక్యంగా హక్కులను సాధించుకోవాలన్నారు. జైనూరుఘటన తర్వాత చట్టాలపై ఆదివాసీలకు అవగాహన కల్పించామన్నా రు. అడవారిని ఎవరు కన్నెత్తిచూసినా ఉపేక్షిం చేది లేదన్నారు. జిల్లాలో శాంతియుత వాతావార ణాన్ని నెలకొల్పాలని పేర్కొన్నారు. ఎక్కడచూసినా పోడు సమస్య ఉత్పన్నమవుతుందని ఫారెస్టు అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించవద్దన్నారు. అడవిని కాపాడడంలో అవగాహన కల్పించి అడ వులరక్షణలో భాగస్వామ్యం చేయాలన్నారు. అటవీ అధికారులు హద్దులు మీరిఇష్టాను సారంగా ప్రజలమీద, ఆదివాసీలపై దౌర్జన్యా లకు పాల్పడితేచర్యలు తప్పవని హెచ్చరించారు.

ఐటీడీఏల అభివృద్ధి కృషి
- ఎంపీ గోడం నగేష్



సమగ్ర గిరిజనఅభివృద్ధి సంస్థలను ప్రభుత్వం బలో పేతంచేసే దిశగా కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని ఎంపీ గోడం నగేష్ అన్నారు. ఈప్రాంతాల అభివృద్ధిలో భాగంగా నిధుల మంజూరుకు కృషిచేస్తామన్నారు. ప్రధానమంత్రి జన్‌మన్ పథకంకింద పీవీటీజీ గ్రామాలను గుర్తించి ఆ గ్రామాల్లో మౌళిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు.

వర్ధంతి సభలో సమస్యలపై ఏకరువు

వర్ధంతి సభలో గిరిజన సంఘాల నాయకులు సమస్యలపై ఏకరువ పెట్టారు. ఆదివాసీ తెగలలోని పలుసంఘాల నాయకులు తమ సమస్యలను తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కుల సంఘాలకు సంఘభవనాలను కేటాయించాలన్నారు. అత్యంత వెనుక బడ్డ పీవీటీజీ తెగలను గుర్తించి ఉద్యోగకల్పనలో ప్రాధాన్యత ఇవ్వాల న్నారు. ఆదివాసీ తెగల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. ఆటవీహక్కు పత్రాలు కొందరికి అందలేదని వాటిని వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రోడ్డు సౌకర్యం లేని గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని, రోడ్డు నిర్మాణాలకు ఆటవీ అనుమతులను ఇవ్వాలన్నారు.

ఆదివాసీల గ్రామాల అభివృద్ధికి చర్యలు
- కలెక్టర్ వెంకటేష్ దోత్రే



ఆదివాసీల గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. పెసా, 1/70చట్టాలను పకడ్బందీగా అమలు చేసేందుకు అధికారుల సమన్వయంతోచర్యలు తీసుకుంటున్నామన్నారు. జోడేఘాట్ పరిసర గ్రామాల్లో ప్రజలకు ఎలాంటిఅసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసు కోవడంతోపాటు వైద్యశిబిరాలు ఏర్పాటుచేసి సేవలందిస్తామన్నారు.

గిరిజనుల సంక్షేమానికి కృషి
- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ద్వారా గిరిజనుల సంక్షేమం కోసం ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

కుమరం భీం ఆశయ సాధనకు కృషి
-ఎమ్మెల్సీ దండె విఠల్



కుమరంభీంఆశయ సాధ నకు తనవంతు కృషిచేస్తా నని ఆదివాసుల సమస్యల పరిష్కారంపై రాష్ట్రమంత్రి, ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తా నని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు.

అభివృద్ధిపథంలో తీసుకువెళ్లేందుకు కృషి చేయాలి..
- ఎమ్మెల్యే కోవ లక్ష్మి



కుమరంభీం ఏలిన పోరు గడ్డను అభివృద్ధి పథంలో తీసుకువెళ్లెందుకు ప్రభుత్వం కృషిచేయాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మిఅన్నారు. ఈ ప్రాంతం లోని 12గ్రామాల్లోవిద్య, వైద్యం,రహదారుల నిర్మాణంతోపాటుమండలకేంద్రాలకు అనుసం ధానంచేస్తూ రహదారుల నిర్మించాలన్నారు.

ఐటీడీఏలను బలోపేతం చేయాలి..
ఎమ్మెల్యే హరీష్‌బాబు



ఐటీడీఏలను బలోపేతం చేయాలని, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌నిధులను సక్రమంగా అమలు చేయా లని ఎమ్మెల్యే హరీష్‌బాబు అన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నిర్మించాలి. పోడు భూము లపై ఫారెస్టు అధికారులు దౌర్జన్యాలకు పాల్పడుతున్నార న్నారు.

సర్వహక్కులు ఆదివాసీలకు కల్పించాలి..

కుమరం సోనేరావు



జల్, జంగల్, జమీన్‌పై సర్వహక్కులు ఆదివాసీలకు కల్పించినపుడే కుమరంభీం ఆశయం నేరవేరుతుందని కుమరం భీం మనవడు సోనేరావు అన్నారు.



సభకు హాజరైన ప్రజలు



గిరిజన మ్యూజియంలో కళాఖండాలు తిలకిస్తున్న మహిళలు



జోడేఘాట్‌లో గుస్సాడీ నృత్యాలు చేస్తున్న ఆదివాసులు



కుమరం సోనేరావును సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

మానవత్వం చాటుకున్న మాజీసర్పంచ్



అంత్యక్రియలు నిర్వహిస్తున్న మాజీ సర్పంచ్ శ్రీనివాస్

పెంచికలపేట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలం లోని లోడ్‌పల్లి గ్రామ మాజీ సర్పంచ్ జాజిమొగ్గ శ్రీనివాస్ అనాథ శవానికి అంత్య క్రియలు నిర్వహించి మాన వత్వాన్ని చాటుకున్నాడు. అదే గ్రామానికి చెందిన కుర్మ పోశం(80)కు నా అనేవాళ్లు ఎవరూలేరు. కొన్ని సంవత్స రాలుగా యాచకుడిగా జీవనం సాగిస్తున్నాడు. అనా రోగ్యంతో గురువారం మృతి చెందాడు. అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు, బంధువులు ఎవరూ లేకపోవడంతో మాజీసర్పంచ్ శ్రీనివాస్ అన్ని తానై హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన ఔదారాన్ని పలువురు ప్రశంసించారు.

జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



సాపిల శిరీష

దహెగాం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నరాస్పెల్లి గ్రామానికి చెందిన సాపిల శిరీష ఈనెల19 వరకు వెస్ట్‌బెంగాల్‌లో జరిగే సీనియర్ జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ జితేందర్‌సింగ్ తెలిపారు. శిరీష 1నుంచి 10వతరగతి వరకు చిన్నరాస్పెల్లి జడ్పీఎస్ఎస్‌లో చదవగా ఇంటర్మీడియట్ సిద్దిపేట జిల్లాలోని మహాత్మ జ్యోతిబాఫూలే కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదుతోంది. ఈ సంద ర్భంగా ఆమెను ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు పురుషోత్తం, రఘునాథ్, హెచ్‌ఎం సునీత అభినందించారు.

ఎమ్మెల్సీని కలిసిన లారీ అసోసియేషన్ సభ్యులు

కాగజ్‌నగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్‌ను గురువారం లారీ అసోసియేషన్ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు కిషోర్‌బాబు మాట్లా డుతూ 21రోజులుగా వివిధ రకాలుగా సమ్మె చేస్తున్నప్పటికీ ఎస్పీఎం యాజమాన్యం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించటం లేదన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు.



ఎమ్మెల్సీ దండె విఠల్‌తో మాట్లాడుతున్న లారీ అసోసియేషన్ సభ్యులు

మండలాల్లో కుమరం భీంకు ఘన నివాళులు







కాగజ్‌నగర్‌లో భీం వర్ధంతి వేడుకల్లో పాల్గొన్న పీఆర్టీయూటీఎస్, సీపీఎం నాయకులు, బీఆర్ఎస్ నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 17: ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో భీం వర్ధంతిని ఘనంగా నిర్వహిం చారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ నాయకులు శాంతికుమారి, రమేష్, హేమంత్‌సిండె, సుభాష్, ఊశన్న, నవీన్, రవి, సంతోష్, సునీల్‌కుమార్, దేవాజీ, శ్రీనివాస్, రాజన్న, రాజేందర్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్‌పట్టణంలో గురువారం పీఆర్టీయూటీ ఎస్, విశ్రాంతఉద్యోగులసంఘం, బీఆర్ఎస్‌పార్టీ, సీపీఎం ఆధ్వర్యంలో కుమరంభీంవర్ధంతిని నిర్వహించారు. డాడానగర్ చౌరస్తాలోగల కుమరంభీం విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భీం ఆశయాలను సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఐటీడీఏ ఏర్పాటుచేసి ఇప్పటికీ 50ఏళ్లు గడిచి నా ఇంతవరకు గిరిగ్రామాల్లో ఆశించిన అభివృద్ధి జరగలేదన్నారు. గిరిజనుల ఆర్థికాభివృద్ధికికేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు తోడ్పాటునందించా లని కోరారు. ఆయాకార్యక్రమాల్లో పీఆర్టీయూటీఎస్ జిల్లాగౌర వఅధ్యక్షుడు ఉప్పులనరసింహచారి, ప్రధానకార్యదర్శి అనిల్, విశ్రాం త ఉద్యోగులసంఘం అధ్యక్షుడు మౌల్కర్‌జయదేవ్, బీఆర్ఎస్‌పార్టీ సిర్పూరు నియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యాంరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్, సీపీఎం కమిటీ సభ్యులు బండారు రవికుమార్, సీపీఎం జిల్లాకార్యదర్శి కూశనరా జన్న, బీఆర్ఎస్‌నాయకులు అంబాలఓదెలు, సలీం, పీఆర్టీయూటీఎస్ మండలఅధ్యక్షుడు ఎనగంటి భిక్షపతి, ప్రధానకార్యదర్శి పత్తిపాక శ్రావణ్‌కుమార్, విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు, సీపీఎం నాయకులు కోట శ్రీనివాస్, ముంజం శ్రీనివాస్, దుర్గం దినకర్, ముంజం ఆనంద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కౌటాల/బెజ్జూరు/సిర్పూర్(టి)/వాంకిడి/చింతలమానేపల్లి/సిర్పూర్(యు): మండలకేంద్రాల్లోనిఎంఈవో,ఎంపీడీవో కార్యాల యాల్లో కుమరంభీం వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చింతలమానేపల్లి మండలకేంద్రంలో మాజీఎమ్మెల్యే కోనేరు కోనప్ప పాల్గొని భీంవిగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఛత్రపతిశివాజీ, అంబేద్కర్ విగ్రహాలకు పూల మాలలు వేశారు. కౌటాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో హన్మంతు, చింతలమానేపల్లి ఎంఈవో జయరాజు, ఉపాధ్యాయులు తిరుపతి, మధుకర్, అశోక్, శ్రీనివాస్, జ్ఞానేశ్వర్, ఉపాధ్యాయులు, ఎమ్మార్సీసిబ్బంది, బెజ్జూరులో ఆదివాసీనాయకులు చిన్నయ్య, రాజా రాం, మధుకర్, తిరుపతి, రామయ్య, రమేష్, సంతోష్, భిక్షపతి, మల్లేష్, తిరుపతి, సిర్పూర్(టి)లోఎంపీడీవో సత్యనారా యణ, ఈజీఎస్, ఎంపీడీవో కార్యాలయసిబ్బంది, వాంకిడిలో మాజీజడ్పీటీసీ అజయ్‌కుమార్, మాజీ సర్పంచ్ తుకారాం, నాయులు రాకేష్, ఆశుతోష్, అహ్మద్, సాయినాథ్, చింతలమానేపల్లిలో మాంతయ్య, బాపు, శంకర్, ప్రసాద్, ఫణిందర్, రాజయ్య, వెంకయ్య సిర్పూర్ (యు)లో జైనూర్ మార్కెట్‌కమిటీ మాజీచైర్మన్ ఆత్రం భగవంత్ రావు, బ్యాంక్ అధికారి ఆత్రం సునీల్‌కుమార్, మాజీ సర్పంచులు మెస్రం భూపతి, ఆత్రం ఓంప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



బెజ్జూరులో భీం విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆదివాసీ నాయకులు



వాంకిడిలో భీం విగ్రహానికి పూల మాల వేస్తున్న నాయకులు



చింతలమానేపల్లిలో కుమరం భీంకు నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప